ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 5 సెప్టెంబరు 2024



కాశన్నగుంట చెరువు శిఖంలో నిర్మించిన పరిశ్రమ

చెరువు శిఖం హాంఫట్!

చెరువు శిఖాలను రియల్ వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు చెరబడుతున్నారు. పారిశ్రామిక వాడలుగా గుర్తింపు పొందిన షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ మండలాల్లో పలు చెరువుల శిఖాలను యథేచ్ఛగా కబ్జా చేశారు. పలు చోట్ల పరిశ్రమలను ఏర్పాటు చేయగా.. మరికొన్ని చోట్ల రియల్ వ్యాపారులు వెంచర్లు వేసి ప్లాట్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చివరికి పాటు కాలువలను సైతం వదలకుండా మాయం చేశారు. దీంతో చెరువులు నిండితే తమ ఇళ్లల్లోకి వరద వస్తుందని చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరగుతున్నా రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

యథేచ్ఛగా పరిశ్రమలు, వెంచర్ల ఏర్పాటు

- రైతుల పొట్టకొడుతున్న పరిశ్రమల యజమానులు
- పాటు కాలువలను సైతం వదలని రియల్టర్లు
- సమీప కాలనీల్లోకి చేరుతున్న వరద నీరు
- కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో కుచించుకుపోయిన చెరువులు, కుంటలు
- పట్టించుకోని రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



తీగాపూర్‌లోని బొద్దికుంట శిఖంలో నిర్మించిన పరిశ్రమ

కబ్జాల పర్వం 6

షాద్‌నగర్/కొత్తూరు/నందిగామ, సెప్టెంబర్ 4: చెరువు శిఖం భూముల్లో పేదలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అలాంటి భూములపైనా పరిశ్రమల యజమానులు, రియల్టర్ల కన్ను పడింది. ఇంకేముంది అనేక చెరువుల శిఖాలు నేడు కనుమరుగైపోయాయి. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఆయా పేదవర్గాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, షాద్‌నగర్ నియోజకవర్గంలోని చెరువులకు రక్షణ కరువైంది. దీంతో సేద్యానికి భరోసా లేకుండాపోయింది. చెరువులు, కుంటలు, పాటు కాలువల ఆక్రమణలకు గురికావడం వల్ల భారీ వర్షాలకు కాలనీలన్నీ చెరువులను తలపిస్తున్నాయి.

నిబంధనలు తుంగలో తొక్కి

షాద్‌నగర్ హెచ్ఎండీఏ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలంలో 34, కొత్తూరు మండలంలో 33, నందిగామ మండలంలో 33 చొప్పున చెరువులు, కుంటలు ఉన్నాయి. కొత్తూరు మండలం శివారు గ్రామాల్లోని చెరువులు, కుంటలను కబ్జా చేసి పదుల సంఖ్యలో పరిశ్రమలను ఏర్పాటు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూముల్లో కొంతమంది రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్నాయి. ఆయా భూములను విక్రయించరాదని, కేవలం వాటిని సాగు కోసమే వాడుకోవాలన్న నిబంధనలు ఉన్నాయి. కానీ కొంతమంది ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ చెరువు స్థలాలను కొనుగోలు చేసి పరిశ్రమలను నెలకొల్పారు. వారితో పాటు రియల్ వ్యాపారులు కూడా పాటు కాలువలు, శిఖం భూములను కబ్జా చేసి అందులో వెంచర్లు ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వాడగా ఎంతో పేరు గాంచిన కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో కూడా చెరువులు, కుంటలను ఆక్రమించి పరిశ్రమలను నెలకొల్పారు.

కొత్తూరులో బొద్దుకుంట చెరువు మాయం

కొత్తూరు మండలం తీగాపూర్ గ్రామ శివారులో 9 ఎకరాల్లో విస్తరించి ఉన్న బొద్దుకుంట చెరువు సమీపంలో ఒక పరిశ్రమను నెలకొల్పారు. ఈ చెరువులో సుమారు 2 ఎకరాల శిఖం భూమిని ఆక్రమించి పరిశ్రమ నెలకొల్పారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల చెరువులోని జలాలు కలుషితమయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 30 ఎకరాల్లో కాశన గుంట చెరువు విస్తరించి ఉంది. ఇందులో కూడా సుమారు 2 ఎకరాలు భూమిని ఆక్రమించుకుని పరిశ్రమ నెలకొల్పారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిక తోడు ఆ పరిశ్రమ చుట్టూ ప్రహరీ నిర్మించారు.

ఫరూఖ్‌నగర్‌లో చెరువు చుట్టూ ప్రహరీ నిర్మాణం

ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులోని లాడెం చెరువుతో పాటు కాలువకు అడ్డంగా ప్రీకాస్ట్ వాల్ నిర్మించారు. అదే మండల పరిధిలోని వీరమోని చెరువు పాటు కాలువకు అడ్డంగా ఒక వ్యక్తి ప్రహరీ నిర్మించారు. దీనివల్ల చెరువులోని నీరు నిండి పంట పొలాల్లోకి ప్రవహిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున శిఖం భూములు ఆక్రమణలకు గురవుతున్నా ఇరిగేషన్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆక్రమణలకు గురైన శిఖం భూములను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నందిగామలో పీర్లకుంట చెరువు ధ్వంసం

నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో చెరువులోకి వెళ్లే కాలువను రియల్ వ్యాపారులు కబ్జా చేసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. అదే మండల పరిధిలోని పీర్లకుంట చెరువు కట్టను ధ్వంసం చేసి రోడ్డును ఏర్పాటు చేశారు. దీనివల్ల చెరువులో ఉన్న నీరు కాలువ గుండా బయటకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో నీరంతా పక్కనే ఉన్న పంట పొలాల్లోకి వచ్చి చేరుతోంది. ఇటీవల నందిగామ మండల పరిధిలో ఒక ప్రజాప్రతినిధి కాలువపై నిర్మించిన ప్రీకాస్ట్ వాల్‌ను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు.



పీర్లకుంట చెరువు కట్టను ధ్వంసం చేసి నిర్మించిన రోడ్డు

శిఖం భూములను కాపాడాలి



శిఖం భూములను కాపాడాలి. భావితరాలకు సాగు, తాగు నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకే శిఖం భూములకు మార్కింగ్ చేసి గుర్తించాలి. వాటిని రైతులు సాగు చేసుకోవాల్సిందే తప్ప అమ్మడానికి వీలులేదు. ఈ విషయాలు తెలిసినా కొందరు బడా నేతలు, వ్యాపారస్తులు ఆ భూములను కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయంపై ముందుగా నాయకులే కళ్లు తెరవాలి. అధికారులు కూడా ఒత్తిళ్లకు తలొగ్గి నిర్మాణాలకు అనుమతించకూడదు.

- బక్కని నర్సింహులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు

చెరువును పూడ్చిన మున్సిపల్ చైర్మన్‌పై కేసు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 4: పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని మీరాలం కుంటను పూడ్చిన మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డిపై ఇరిగేషన్ ఏఈ పరమేశ్ పోచారం ఐటీ కారిడార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన '4 చెరువులు మాయం' కథనానికి అధికారులు స్పందించారు. ఏఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు పోచారం మున్సిపల్ చైర్మన్‌పై కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చకచకా ఆర్ఆర్ఆర్ పనులు

- హద్దురాళ్లు.. వాటిపై జీపీఎస్ మార్కింగ్
- పొలాల్లో హద్దురాళ్లు పాతడంపై రైతుల ఆందోళన



చేవెళ్ల మండలం ఖానాపూర్-కిష్టాపూర్ మధ్యలో హద్దురాయి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4: రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చే ప్రాజెక్టుగా భావిస్తున్న హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఆర్ఆర్ఆర్‌ను నిర్మించే ప్రాంతాలలో హద్దురాళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రాంతాలను జీపీఎస్‌కు అనుసంధానిస్తూ ఆ రాళ్లపై మార్కింగ్ చేస్తున్నారు. ఆర్ఆర్ఆర్‌ను ఉత్తరం, దక్షిణం అనే రెండు భాగాలుగా విభజించిన విషయం తెలిసిందే. దక్షిణ భాగంలో సంగారెడ్డి నుంచి కంది, నవాబ్‌పేట, చేవెళ్ల, షాబాద్, షాద్‌నగర్, ఆమనగల్లు, మర్రిగూడ, శివన్నపేట, సంస్థాన్ నారాయణపూర్ మీదుగా చౌటుప్పల్ వరకు సుమారు 182 కి.మీ.ల పొడవున ఆర్ఆర్ఆర్‌ను నిర్మించనున్నారు. దీంట్లో భాగంగా బుధవారం కొందుర్గు మండలంలోని దిలీప్ టెక్స్‌టైల్ పరిశ్రమ, భైరంపల్లి, ఉత్తరాస్‌పల్లి, ముట్పూర్, షాబాద్ మండలంలోని తిర్మలాపూర్, మిట్ట కంకల్, పూడూర్ మండల పరిధిలోని కడ్మూర్, చేవెళ్ల మండలంలోని ఖానాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో హద్దురాళ్ల పాతి జీపీఎస్ మార్కింగ్ చేశారు. ప్రతీ ఐదు కి.మీ.లకు ఒక పాయింట్ ఏర్పాటు చేశారు. మార్కింగ్ పూర్తయిన వెంటనే సర్వే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఆర్ఆర్ఆర్ హద్దురాళ్ల పాతడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాల నుంచి రోడ్డు నిర్మాణం చేపడితే భూములు కోల్పోయి రోడ్డున పడతామని వాపోతున్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా డా.రాకేష్‌భవాని



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 4: రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారానికి కవి, రచయిత, గాయకుడు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతల రాకేష్‌భవాని ఎంపికయ్యారు. నేడు(గురువారం) గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరుగనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. అకామడిక్ రీసెర్చ్, ఎన్ఎస్ఎస్ విభాగాల్లో కూడా ఆయన తన ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా డా.రాకేష్‌భవానిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్, అధ్యాపక బృందం అభినందించింది.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ శశాంక

పంట నష్టాన్ని అంచనా వేయండి

- అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశాలు
- కలెక్టరేట్‌లో మట్టి గణపతుల పంపిణీ

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబర్ 4: వర్షాల కారణంగా జిల్లాలో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు వెంటనే సమర్పించాలని కలెక్టర్ శశాంక సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పంట నష్టంపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా జరిగిన ఆస్తి, ప్రాణ, పంట నష్టాన్ని అంచనా వేసి వెంటనే నివేదిక అందించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో పర్యటించి బాధ్యతగా పని చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, డీపీవో సురేశ్ మోహన్, సీపీవో సౌమ్య, వ్యవసాయ అధికారి నర్సింహారావు, ఇరిగేషన్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టితో గణేశ్ విగ్రహాలను తయారు చేయాలి

మట్టి గణపతులనే పూజించాలని కలెక్టర్ శశాంక అన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆయన బుధవారం కలెక్టరేట్ ఉద్యోగ, సిబ్బందికి మట్టి గణపతులను పంపిణీ చేశారు. చెరువుల్లోని మట్టితో గణేశ్ విగ్రహాలను తయారు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ ఇంజనీర్ జి.శ్రీవాస్తవ, సహాయ పర్యావరణ శాస్త్రవేత్త ఆర్.మహేశ్ పాల్గొన్నారు.



గౌరిపల్లిలో నేలవాలిన జొన్న పంటను పరిశీలిస్తున్న డీఏవో నర్సింహారావు

రైతులు ఆందోళన చెందొద్దు

- డీఏవో నర్సింహారావు

తలకొండపల్లి, సెప్టెంబరు 4: వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతుల ఎవరూ ఆందోళన చెందొద్దని, త్వరలోనే పంటనష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నర్సింహారావు తెలిపారు. నష్టపోయిన పంటలకు సంబంధించి రైతుల వారీగా ప్రాథమిక అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం గౌరిపల్లి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ ఆదిలక్ష్మి, స్థానిక ఏవో రేణుకచక్రవర్తితో కలిసి దెబ్బతిన్న జొన్న, పత్తి పంటలను ఆయన పరిశీలించారు. పంట నష్టాన్ని సంబంధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎవరు అధైర్యపడొద్దని సూచించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని నర్సింహారావు తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పంటనష్టం అంచనాలు తయారు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల కుటుంబ నిర్ధారణ సర్వే చురుకుగా సాగుతుందని తెలిపారు. ఈ ఏడాది వానా కాలం పంటలు జిల్లాలో ఆశాజనకంగా ఉన్నాయని ఆయన వివరించారు. వర్షాల నేపథ్యంలో పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున రైతులు తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డీఏవో సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

భూమి ఉన్నా.. లేనట్లే!

- 8 ఏళ్లుగా నిషేధిత జాబితాలో పట్టా భూములు
- అత్యవసరమైనా అమ్ముకోలేక రైతుల ఆవేదన
- ఫార్మాసిటీ ఏర్పాటు పేరుతో గత ప్రభుత్వ నిర్వాకం
- సంక్షేమ పథకాలకు నోచుకోని రైతులు

యాచారం, సెప్టెంబరు 4: ఎనిమిదేళ్లుగా పట్టా భూములను నిషేధిత జాబితాలో ఉంచడంతో రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న పట్టా భూములను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకు రైతుల అభిప్రాయాలను సేకరించకుండానే ఆయా భూములను నిషేధిత జాబితాలో పెట్టింది. దాంతో 8 ఏళ్లుగా ఆ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలేవీ వర్తించడం లేదు. అవసరమైన వారు ఆ భూములను విక్రయించలేక, అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించిది. తమ పట్టా భూములపై ప్రభుత్వ పెత్తనమేంటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా న్యాయం చేయాలి

కుర్మిద్దలో 974.4 ఎకరాలు. నానక్‌నగర్‌లో 154.16ఎకరాలు, తాటిపర్తిలో 382.33ఎకరాలు, మేడిపల్లిలో 483.25 ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. దాంతో కొందరు రైతులు తమ కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చడం కోసం భూమి విక్రయించే వీలు లేకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పట్టాభూములను నిషేధిత జాబితా నుంచి తొలగింపచేసి న్యాయం చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే, భువనగిరి ఎంపీల దృష్టికి తీసుకెళ్లామని అయినా తమకు న్యాయం జరగడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే.. తమ గోడు వినిపించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి కల్పించుకొని ఆదుకోవాలని కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు గ్రామాల్లో పర్యటించి తమగోడు విని నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములకు విముక్తి కల్పించాలని రైతులు కోరుతున్నారు.



నిషేధిత జాబితాలో ఉన్న పట్టాభూమి

పట్టాభూమి ఉందని అప్పు చేశా



నాకు పట్టాభూమి ఉందని పెట్టుబడికి, కుటుంబ అవసరాల కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద చాలా అప్పులు చేశా. అప్పులు తీర్చడం కోసం నా భూమి అమ్ముకుందామంటే నిషేధిత జాబితాలో ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నిషేధిత జాబితా నుంచి మా భూములను తొలగించి ఆదుకోవాలి.

- పెంటయ్య, రైతు, కుర్మిద్ద

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 170 మంది

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 4: గురుపూజోత్సవం సందర్భంగా నేడు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నారు. జెడ్పీ ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరు కానున్నారు. మొత్తం ఉత్తమ ఉపాధ్యాయులుగా 170 మందిని ఎంపిక చేశారు. ముగ్గురు మండల నోడల్ అధికారులు, 10 మంది గెజిటెడ్ హెచ్ఎంలు, ఇద్దరు ప్రిన్సిపాల్‌లు, 8 మంది ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు, 68 మంది స్కూల్ అసిస్టెంట్లు, 65 మంది ఎస్జీటీలు, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేకాధికారి, 13 మంది ప్రైవేట్ టీచర్లు ఉన్నారు. వీరందరూ నేడు అవార్డులను అందుకోనున్నారు.



వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబర్ 4 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం సీజనల్ వ్యాధుల పట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులకు, సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల ద్వారా డెంగీ జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయన్నారు. 2022లో 765 డెంగీ కేసులు రాగా 2023లో 543 కేసులు, 2024లో ఇప్పటివరకు 210 కేసులు వచ్చినట్లు చెప్పారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. మాత శిశు సంరక్షణలో భాగంగా గర్భిణుల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రులో ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. పుట్టిన ప్రతీ బిడ్డకు వంద శాతం వ్యాక్సినేషన్ చేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



తాగునీటి సమస్య తీర్చాలని ఎండీకి వినతి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 4: పోచారం మున్సిపాలిటీ పరిధి యంనంపేట్ ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, నారపల్లి, పోచారంలో తాగునీటి ఇబ్బందులను తీర్చాలని బుధవారం పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ట్యాంకులు నిర్మించినా నీటి సరఫరా చేయడం లేదన్నారు. పైపులైన్ వేయాల్సి ఉందన్నారు. నారపల్లికి ఎప్పుడో ఓసారి నీటిని సరఫరా చేసి బిల్లును మాత్రం మొత్తానికి ఇస్తున్నారని చెప్పారు. దీన్ని పరిశీలించి నీటి బిల్లును రద్దుచేయాలని కోరారు. ఎండీని కలిసిన వారిలో కౌన్సిలర్లు, మహేష్, రాజశేఖర్, నాయకుడు కాశయ్య తదితరులు ఉన్నారు.


ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే గుర్తింపు


మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పావని

ఘట్‌కేసర్, సెప్టెంబరు 4 : మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. బుధవారం కొండాపూర్‌లో మెప్మా సహకారంతో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. వ్యాపారంలో రాణించాలంటే ఓపికగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ సాబెర్ అలీ, కౌన్సిలర్లు హేమలత, వెంకటర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

నాపరాతి గనుల్లో భారీగా చేరిన వర్షపు నీరు

బషీరాబాద్, సెప్టెంబరు 4: చుట్టూ నాపరాళ్ల గుట్టలు, మధ్యలో చిన్నపాటి మడుగు.. ఇదంతా చూస్తుంటే ఏదో పర్యాటక కేంద్రం అనుకుంటే పొరపాటే. మూడు రోజులు కురిసిన వర్షాలకు నాపరాళ్ల గనుల్లోకి భారీగా నీరొచ్చింది. నవాల్గ, మాసన్‌పల్లి, కొర్విచెడ్, జీవన్గి, క్యాద్గిరా, ఎక్మాయి గ్రామాల పరిధి నాపరాళ్ల గనుల్లో తవ్వకాలు నిలిచిపోయాయి. గనులు కుంటలను తలపిస్తున్నాయి. వందలాది కార్మికులు పని కోల్పోయారు.


మాసన్‌పల్లిలో నీటితో నిండిన నాపరాతి గని

మట్టి గణపతులను పూజించాలి

వికారాబాద్, సెప్టెంబరు 4 : జిల్లాలోని కుమ్మరి కులవృత్తుల వారిని ప్రోత్సహించేందుకు, పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని జిల్లా బీసీవెల్ఫేర్ అధికారి ఉపేందర్ తెలిపారు. కులవృత్తుల వారికి ప్రభుత్వం శిక్షణిచ్చించిందన్నారు. కుమ్మరుల వద్ద మట్టి గణపతులు కొనాలని తెలిపారు. మట్టి గణపతులు కావాల్సిన వారు వికారాబాద్ కుమ్మరి అంజిలయ్య ఫోన్ నంబర్ 9966466982, పరిగి/గౌరీశంకర్ 9676038986, తాండూరు/శ్రీశైలం 9640518846, కొడంగల్/అంజిలయ్య 9391645200లను సంప్రదించాలన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్, సెప్టెంబరు 4: ప్రభుత్వ ప్రైవేట్, ఎయిడెడ్ కాలేజీల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్టీ వెల్ఫేర్ అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. 2024-25కు ఫ్రెష్, రెన్యువల్ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం డిసెంబరు 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 8639388553 అనే నంబరులో సంప్రదించాలన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే వేటు


విద్యార్థులతో మాట్లాడుతున్న శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్

శామీర్‌పేట, సెప్టెంబర్ 4 : కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. బుధవారం ఎస్వీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల్లో యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ తోటి విద్యార్థులపై ర్యాగింగ్ పాల్పడటం నేరం అన్నారు. ర్యాగింగ్ నిషేదం అన్నారు. ఎవరైనా ర్యాగింగ్ పాల్పడితే బాధిత విద్యార్థులు వెంటనే కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీకిగానీ, యాజమాన్యానికిగానీ, పోలీసులకు గానీ తెలపాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద క్రిమినల్ వేటు వేస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగానికి అర్హులు కారని, కళాశాల నుంచి వారిని తొలగిస్తారని హెచ్చరించారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజానికి పేరుతెచ్చే పౌరులుగా ఎదగాలని పోలీసు అధికారి చెప్పారు. కార్యక్రమంలో శామీర్‌పేట ఎస్సైలు, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో కుక్కకాటు, పాము కాటుకు అందుబాటులో వ్యాక్సిన్

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 4: కుక్కకాటు, పాము కాటు, తేలు కాటుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉందని జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్ బుధవారం తెలిపారు. అవసరమైన వారికి వ్యాక్సిన్ ఉచితంగా అందజేస్తామని, ఈ వ్యాక్సిన్ గురించి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. విషకీటక కాటుకు గురైతే మూఢ నమ్మకాలు, మంత్రాలతో వ్యాక్సిన్ వేసుకోకుండా ఉండొద్దని సూచించారు. బీసీ, షుగర్ వ్యాధులకు కూడా మందులు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందచేస్తామన్నారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

వికారాబాద్, సెప్టెంబరు 4 : జిల్లాలో ఖాళీగా ఉన్న 12 మెడికల్ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు చేసి భర్తీ చేస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పేర్కొన్న సమయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఆలయ భూమిని పరిరక్షించండి

కీసర, సెప్టెంబరు 4 : ఆలయ భూమిని పరిరక్షించాలని కీసర గ్రామస్థులు ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి అనుకొని ఉన్న భూమిని కొందరు కబ్జా చేసి ప్రహరీనిర్మించారని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. సర్వే చేసి ఆలయ భూమిని కాపాడాలని గ్రామస్థులు ఎంపీని కోరారు. ఎంపీని కలిసిన వారిలో నల్లా వెంకట్‌రెడ్డి, జూపల్లి అశోక్, చంద్రమౌళి పాల్గొన్నారు.


ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కీసర గ్రామస్థులు

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి

కీసర, సెప్టెంబరు 4 : ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అంకిరెడ్డిపల్లి గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 918, 917, 886, 887లలో సాల్వో ఎక్స్‌ప్లోసివ్ పరిశ్రమ వారు అక్రమంగా ప్రహరీ నిర్మిస్తున్నారని తెలిపారు. వారు అక్రమ మైనింగ్ చేస్తుండటంతో గ్రామంలో తమ ఇళ్లు కూలుతున్నాయని గ్రామస్థులు అధికారులకు తెలిపారు. అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, బాల్‌రాజ్, రమేష్, మహేష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

పంటలు పాడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

వికారాబాద్, సెప్టెంబర్ 4: కురుస్తున్న అధిక వర్షాలకు పంటలు పాడవకుండా ఉండేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ టి. లక్ష్మణ్, శాస్త్రవేత యమున బుధవారం తెలిపారు. ఆదివారం అధిక వర్షాలతో వరి, మొక్కజొన్న, పత్తి చేలల్లో నీరు నిలిచిందన్నారు. నీరు బయటికి పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కీసరగుట్ట హుండీ ఆదాయం రూ.20.6లక్షలు


కీసర, సెప్టెంబర్4: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం 20.6 లక్షలు వచ్చిందని రంగారెడ్డి జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ శేఖర్ తెలిపారు. బుధవారం ఐదు నెలల హుండీ లెక్కించారు. ఆలయ ఆదాయాన్ని బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.



హుండీని లెక్కిస్తున్న భక్తులు

చెంచుల సమస్యల పరిష్కారానికి కృషి

● గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి

కులకచర్ల, సెప్టెంబరు 4: చెంచు కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తోందని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. ప్రధాని జన్మాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోగల చెంచు కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తామని అధికారి ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బాలవరలక్ష్మి, చెంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.







వికారాబాద్ జిల్లాలో 39 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

నేడు అసెంబ్లీ స్పీకర్ చేతుల మీదుగా సన్మానం

వికారాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 39 మంది ఉపాధ్యాయులను ఉత్తములుగా ఎంపిక చేశారు. 49మంది దరఖాస్తు చేసుకోగా 39 మందిని ఎంపిక చేశారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో గంగుల రవీందర్‌రెడ్డి(చౌదర్‌పల్లి), కె.రాంచంద్రయ్య, డి.హన్మంత్‌రెడ్డి(చన్‌గోముల్), కృష్ణకుమార్(సిరిగిరిపేట్), కెతావత్ తౌర్యా, బి.బుచ్చయ్య(పరిగి), జి.విద్యావతి(చెంగోల్), బి.కరుణాకర్, ఆర్.హన్మంతు(హకీంపేట్), సి.ఉమేష్(రాంపూర్), ఎం.మంజుల(కులకచర్ల), కె.సంపత్‌కుమార్(కొంశెట్‌పల్లి), కె.సంగీత(మంబాపూర్), బి.శ్రీనివాస్(మిట్టకోడూర్), సి.బుచ్చిరెడ్డి, ఫాతిమాబేగం(కోట్‌పల్లి), భీమ్యానాయక్ (కిష్టాపూర్), పి.విజయలక్ష్మి(పెద్దేముల్), కె.విజయ్‌ఆనంద్(ఇందూర్), జె.సుధాకర్ (కొడంగల్)లను ఎంపికయ్యారు. పీజీటీ విభాగంలో బి.కొండయ్య(టీజీఎంఎస్ బంట్వారం), టి.మాధవి(టీజీఎంఎస్ పూడూరు), ఎల్‌ఎఫ్ ఎల్ హెచ్‌ఎం విభాగంలో మొగులయ్య(అగ్గనూర్) ఎంపికయ్యారు. ఎస్జీటీ విభాగంలో వి.సుజాత(మన్నేగూడ), బి.కృష్ణయ్య(గుండాల్), కె.వాణి(మైలారం-దోమ), బి.ఆంజనేయులు(నాగసాన్‌పల్లి), విస్లావత్ పాండ్యా(సాల్వీడ్), వి.దేవ్లా(హన్మానాయక్ తండా), కె.రమేష్(సిరిపురం), కె.ప్రభాకర్‌రెడ్డి(సుల్తాన్‌పూర్), నసీమున్నీసా(సర్సన్‌పల్లి), బి.రాధిక(కోట్‌బాస్‌పల్లి), ఎం.నాగరాణి(పులుమద్ది), శేరి వీరప్ప(మోమిన్‌కుర్దు), డి.రవి(కొత్లాపూర్), ఎం.రాఘవేందర్‌రెడ్డి(మైల్వార్), ఎం.మురహరి(అగ్గనూర్), ఎ.క్రిష్టవేణి(కేజీబీవీ యాలాల్) ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేటి(గురువారం) ఉదయం 10:30గంటలకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఆయన జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

కలెక్టరేట్‌లో 'వార్తల్యాప్' వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో బుధవారం పత్రిక సమాచారంపై వార్తల్యాప్ మీడియా వర్క్‌షాప్ ఎను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు చేసే ప్రతీ కార్యక్రమాన్ని ప్రజలకు తెలిసేలా చూడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న ప్రజాసంక్షేమ పథకాలు పేదలకు చేరేలా చూడాల్సి బాధ్యత అధికారులదేనని, ఆ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరాయా? లేదా? అని నిర్ధారించుకుని వార్తలు రాయాల్సిన బాధ్యత మాత్రం పాత్రికేయులదేనన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పీఐబీ(వార్తల్యాప్) మీడియా వర్క్ షాప్ ఏ విధంగా పనిచేస్తుంది? మీడియాకు సమాచారం ఎలా ఇవ్వాలి? ఎన్ని భాషల్లో సమాచారాన్ని పత్రికలకు, మీడియాకు చేరవేయాలి? అనే అంశాలపై వివరించారు. ప్రతీ జర్నలిస్ట్ ఈ వార్తల్యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఐబీ లాంటి కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నేడు మన మధ్యకు వచ్చి జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌లను నిర్వహిస్తోందని ఇందుకు పీఐబీ బృందాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సమాచార కార్యాలయం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తోందని, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి కచ్చిత సమాచారాన్ని ప్రజలకు, మీడియాకు చేరవేయడంలో పత్రికా సమాచార కార్యాలయం ముఖ్య భూమిక పోషిస్తోందని తెలంగాణ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతిపాటిల్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, వివేకానంద, డీఆర్ పీఐబీ సంపత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న ఎస్పీ కె.నారాయణరెడ్డి

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పరిగి/తాండూరు, సెప్టెంబరు 4: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పరిగిలోని గ్రీన్‌పార్కు హోటల్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఉత్సవాలను హిందూ, ముస్లింలు సోదరభావంతో నిర్వహించుకోవాలన్నారు. మండపాల వివరాలను పోలీసు స్టేషన్‌లతో తప్పక నమోదు చేయించుకోవాలని సూచించారు. మండపాలు, ఉత్సవాల్లో ఏమైనా ఇబ్బందికర సంఘటనలు జరిగితే మండపాల నిర్వాహకులే బాధ్యత వహించాలన్నారు. లౌడ్‌స్పీకర్లు, డీజేలకు అనుమతి తప్పనిసరన్నారు. రాత్రి పదిలోపు పూజలు, ఇతర కార్యక్రమాలన్నీ ముగించాలని సూచించారు. మద్యం సేవించికానీ, అనుమతి లేని కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐ ఎం.సంతోష్, కమిషనర్ వెంకటయ్య, విద్యుత్ ఏఈ ఖాజా, మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్, నాయకులు ఇ.కృష్ణ, బి.ప్రవీణ్‌రెడ్డి, వి.పెంటయ్య, ఎం.నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అపోహలు, అసత్య ప్రచారాన్ని నమ్మకుండా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి కోరారు. తాండూరు గ్రాండ్ హోటల్‌లో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మతసామరస్యానికి తాండూరును ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, తహసీల్దార్ తారాసింగ్, సీఐలు, నాయకులు రాజుగౌడ్, నర్సింలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీవో మహిరున్నీసా బేగం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కులకచర్ల, సెప్టెంబరు 4: పౌష్టికాహారంతోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అని పరిగి సీడీపీవో మహిరున్నీసాబేగం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీలో పోషణమాసం సందర్భంగా సమావేశం నిర్వహించారు. పిల్లలు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ బాధ్యతతో మెలగాలని తెలిపారు. రెగ్యులర్‌గా పిల్లలు ఎత్తు, బరువు పరిశీలించాలని సూచించారు. వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పరీక్షలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యాదమ్మ, హెచ్‌ఎం శ్రీనివాస్, హెల్త్‌అసిస్టెంట్ వెంకట్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, లలిత, అనసూయ, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.


ప్రీస్కూల్ సామగ్రిని అందజేస్తున్న సూపర్‌వైజర్ రాణి

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి అందజేత

తాండూరు రూరల్, సెప్టెంబరు 4: ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యను బోధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గ్రామాల అంగన్‌వాడీలకు ప్రీ స్కూల్ విద్యకు సంబంధించిన సామగ్రిని టీచర్లకు అందజేశారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. తాండూరు ఐసీడీఎస్ పరిధిలో 279అంగన్‌వాడీ కేంద్రాలకు మొదటి విడత 45 కేంద్రాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అంగన్‌వాడీలకు పెయింటింగ్‌తో పాటు నేమ్ బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రీస్కూల్ విద్య ఉద్దేశ్యం చిన్నారులకు ఆట, పాటల రూపంలో అక్షరాలను నేర్పించడం అని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆపరేటర్ ప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

పథకాల లక్ష్యాల పూర్తికి సహకరించాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 4: ప్రభుత్వ పథకాల లక్ష్యాల పూర్తికి ప్రజలంతా సహకరించాలని ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కార్యదర్శులు పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మేడిగడ్డ, శంకర్‌కొండ, సామాయిపల్లి, దయ్యాల బోడు, కేశ్యతండాలలో బుధవారం ఎంపీడీవో పర్యటించారు. నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి పథకాలను పరిశీలించారు. శంకర్‌కొండ తండా పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన రూ.50 వేలతో చేపట్టే పనుల గూర్చి టీచర్లకు సూచనలు చేశారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 4: ప్రజలకిచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడడం లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ విషయంలో ఎవరూ అధైర్యపడొద్దని అర్హులైన ప్రతీ రైతుకు మాఫీ అవుతుందన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి 359 మంది లబ్ధిదారులకు రూ.3.74 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే 113 మందికి రూ.28.66 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ధరణి పోర్టల్‌తో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్యాచరణతో ముందుకు పోతుందన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదల భూములు లాక్కొని అనేక ఇబ్బందులపాలు చేసిందని, కాంగ్రెస్‌ది రైతు ప్రభుత్వమని, ఏదైనా రైతులకు న్యాయం చేకూరుస్తుందన్నారు. ఫోర్త్‌సిటీతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయన్నారు. ఆర్డీవో కె.అనంతరెడ్డి, ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్లు నిరంజన్‌రెడ్డి, స్రవంతి, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం తహసీల్దార్లు సునీతారెడ్డి, ప్రసాద్‌రావు, అయ్యప్ప, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలి

సెర్ప్ సీఈవో దివ్య


కేశంపేట: మహిళా సమాఖ్యా సభ్యులతో మాట్లాడుతున్న దివ్య

కొత్తూర్, సెప్టెంబరు 4: మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో మట్టి పాత్రల తయారీ యూనిట్‌ను బుధవారం సీఈవో పరిశీలించి, మహిళ సంఘాల సభ్యులతో ముచ్చటించారు. మట్టి పాత్రల తయారీ విధానం, మార్కెటింగ్ తదితర అంశాలను సీఈవో దివ్య సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పేరుగాంచిన దర్గాగా గుర్తింపు ఉన్న జేపీ దర్గా ఇన్ముల్‌నర్వకు సమీపంలో ఉండడంతో దర్గాలో మట్టి పాత్రల విక్రయం అధికంగా ఉంటుందని సభ్యులు పేర్కొన్నారు. వివిధ ఆకృతుల్లో మట్టి పాత్రలు తయారు చేసి విక్రయిస్తామని చెప్పగా.. సీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఎం కొండయ్య, సీసీలు రాజప్ప, ఎండీ ఖలీల్, ఎన్.లక్ష్మమ్మ, కె.అలివేలు, వీఏవోలు, గ్రామసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కేశంపేట : బ్యాంకు రుణాలను వినియోగించుకొని మహిళా సంఘాలు అభివృద్ధి చెందాలని సెర్ప్ సీఈవో దివ్య సూచించారు. మండలంలోని తులవానిగడ్డ మహిళా సంఘం సభ్యులతో సమావేశమ్యారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఎలా తిరిగి చెల్లిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రుణాలతో హోటళ్లు పెట్టి వచ్చిన డబ్బుతో తిరిగి చెల్లిస్తున్నామని సభ్యులు తెలిపారు. కేశంపేట మానసిన వికలాంగుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించి.. దివ్యాంగుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేంద్రానికి ఆటో సౌకర్యం కల్పించాలని కోరారు. కేశంపేట మహిళా సమాఖ్యా సభ్యులతో సమావేశమయ్యారు. భూతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ పనితీరు అడిగి తెలుసుకున్నారు. కేశంపేట పునరావాస కేంద్రానికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి కోరారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీవో శ్రీలత, కేశంపేట ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్లు రవీందర్, మైత్రేయి, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

విద్య, వైద్య సదుపాయాల్లో సర్కార్ విఫలం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి


మహేశ్వరం ఆసుపత్రిలో సమస్యలపై డాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సబితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 4 : విద్య, వైద్య సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా సరిగ్గా అమలు చేయడంలేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మండిపడ్డారు. బుధవారం మహేశ్వరంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పాఠశాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు విద్య, వైద్యం ప్రధానమని, ఈ రెండింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానంగా రైతు రుణమాఫీ ఒకటని, దానిని అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సీఎం రుణమాఫీ రూ.31 వేల కోట్లు అని ప్రచారం చేసుకుంటున్నారని, భట్టి విక్రమార్క మాత్రం రూ.7 వేల కోట్లు మాఫీ చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. గ్రామపంచాయితీ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, కార్మికులకు కనీస వేతనం చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం బాధాకరమన్నారు. అభివృద్ధిని పక్కకు పెట్టి హైడ్రాను తెరపైకి తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకేనా ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టిందని ప్రశ్నించారు. ఇప్పుడు కొత్తగా రేషన్, హెల్త్‌కార్డుల కోసం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎంపీడీవో శైలజారెడ్డి, ఆర్ఐ స్వర్ణకుమారి, బీఆర్‌ఎస్ నాయకులు పాండుయాదవ్, డి.వెంకటేశ్వర్‌రెడ్డి, నవీన్, ప్రభాకర్‌రెడ్డి, సుధీర్ గౌడ్, దయ్యాల శ్రీనివాస్, సమీర్, రాజేష్, కె. ప్రభాకర్, పి.బాలయ్య, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

నీవు లేకున్నా.. నీ కళ్లు ప్రపంచాన్ని చూడాలి

ఓ తండ్రి కోరిక.. ప్రమాదంలో గాయపడి

చికిత్స పొందుతూ మరణించిన కుమారుడి కళ్లు దానం


ప్రశాంత్ యాదవ్ (ఫైల్)

నందిగామ, సెప్టెంబరు 4: చిన్నతనంలోనే లోకం విడిచిపోయిన తన కుమారుడి కళ్లు ఇంకొన్నాళ్లు ఈ ప్రపంచాన్ని చూడాలని ఓ తండ్రి కోరుకున్నాడు. ప్రమాదంలో మరణించిన తన కుమారుడి కళ్లను దానం చేసి దాతృత్వం చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే నందిగామ మండలం మేకగూడకు చెందిన ప్రశాంత్‌యాదవ్(26) కారు డ్రైవింగ్ చేస్తూ హైదరాబాద్‌లో ఉండేవాడు. ఈనెల 1న స్వగ్రామం మేకగూడకు వచ్చాడు. 3వ తేదీన మేకగూడ నుంచి కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రశాంత్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హైదబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. కోమాల్లోకి వెళ్లిన ప్రశాంత్ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. తన కుమారుడి మరణం తీరని లోటని, అయినా తన కళ్లు ఈ ప్రపంచాన్ని చూడాలని భావించిన తండ్రి ఆంజనేయులు ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి సమాచారం ఇచ్చి కళ్లు దానంచేసి గొప్ప మనస్సు చాటుకున్నాడు. కాగా, ప్రశాంత్ మృతితో మేకగూడలో విషాదచాయలు అలుముకున్నాయి.


శంకర్‌పల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజలకు ఇబ్బందులు కలగనీయొద్దు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పర్యటన

చేవెళ్ల, సెప్టెంబరు 4 : వానల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగనీయకుండా సమస్యలు పరిష్కరించాలని, వర్షాలు పడినప్పుడే ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులు బయటపడుతాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపాల్ పరిధిలోని ఫత్తేపూర్ బ్రిడ్జి పక్కన గల రోడ్డును, రావులపల్లి గ్రామంలోకి వెళ్లే రోడ్డును పరిశీలించారు. అలాగే మోకిలలోని లా పాలామాలోని విల్లాస్‌లను పరిశీలించి వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకుగాను కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న రోడ్డు పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లా పాలామాలోని విల్లాస్ వద్ద వరద ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా ముందుకెళ్లాలని సూచించారు. ప్రజలకు వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 4: శంషాబాద్ మండలంలోని పాల్మాకుల గ్రామానికి చెందిన కో-ఆపరేటివ్ చైర్మన్, డైరెక్టర్లు, కేంద్ర మాజీ ప్రాసెసింగ్ యూనిట్ డైరెక్టర్, లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ మీడియా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్, ఎంపీటీలసు, వార్డు సభ్యులు, ఆయకట్టు సంఘం చైర్మన్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో వారు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నీళ్ల శ్రీధర్‌గౌడ్, చంద్రారెడ్డి, నీరటి రాజు ముదిరాజ్, జూకల్ శ్రీనివాస్‌రెడ్డి, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై మంచాలలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో అన్నదాతలకు సూచనలిస్తున్న శ్రీకృష్ణ

సమీకృత వ్యవసాయ విధానం లాభసాటి

శాస్త్రవేత్తలు శ్రీకృష్ణ, సుధీర్

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

మంచాల, సెప్టెంబరు 4 : సమీకృత వ్యవసాయ విధానాలు రైతులకు లాభసాటిగా ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.శ్రీకృష్ణ, డా.సుధీర్‌లు సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై మంచాలలో బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణలో భాగంగా అన్నదాతలకు అంతర పంటలు, పోషకాలు, మిశ్రమ పంటలు, మల్చింగ్, పంటలను వైవిధ్యపరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ జీవామృతం, బీజామృతం, దశపర్ణి కషాయం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిహస్త్రం వంటి సంప్రదాయ పద్ధతులతో పంటలను చీడపీడల నుంచి సంరక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి కిషన్‌రావు, నవీన, మంచాల ఏఈవో సాయిసిరి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎం.కృష్ణ, చెన్నయ్య, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన గుడ్లనే వాడాలి


ఊట్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను తనిఖీ చేస్తున్న పద్మజారమణి

కందుకూరు, సెప్టెంబరు 4 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో పాటు బాలింతలకు, గర్భిణీలకు బలవర్ధకమైన ఆహారం అందించాలని, నాణ్యమైన గుడ్లను మాత్రమే వాడాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతీ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజారమణిలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఊట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు తనిఖీ చేశారు. కేంద్రానికి నాణ్యమైన గుడ్లు సరఫరా చేస్తున్నారా? లేదా? అనే విషయమై ఆరా తీశారు. గుడ్లను పగుల కొట్టి నాణ్యతను పరిశీలించారు. ప్రీస్కూల్ తల్లులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. ట్రే గుడ్లు 1500 గ్రాముల కంటే ఎక్కువ బరువు ఉంటేనే తీసుకోవాలని, లేనిచో వాపస్ చేయాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. తక్కువ సైజ్‌లో గుడ్లు ఉంటే తీసుకోరాదన్నారు. నాసిరకం గుడ్లు పంపిణీ చేస్తే తగిన చర్యలుంటాయని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ప్రీస్కూల్ పిల్లల హాజరు శాతం పెంచాలని టీచర్‌ను ఆదేశించారు. అనంతరం కందుకూరు చౌరస్తాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారితో సీడీపీవో శాంతిశ్రీ తదితరులున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


ఆలయంలో పూజలు చేస్తున్న బాల్‌రెడ్డి

తాండూరు రూరల్, సెప్టెంబరు 4: ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. చెంగోల్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు హన్మయ్య ఆధ్వర్యంలో శ్రావణ మాస ముగింపు పూజలు నిర్వహించారు. బాల్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని అన్నదానంలో పాల్గొన్నారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ పవన్, కానిస్టేబుళ్లు పూజల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, తులసీరాం, హన్మయ్య, వెంకటేశం, రాముయాదవ్, నారాయణరెడ్డి, జయంత్, నర్సింహులు, గుర్రంపల్లి రాందాస్, హర్షవర్ధన్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం వారిని మాజీ ఎంపీటీసీ రాములు సత్కరించారు.

పెద్ద చెరువు కల్వర్టును పరిశీలించిన అధికారులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 4: విరిగిన మేడ్చల్ పెద్ద చెరువు వాగు వంతెనను జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డిలు బుధవారం పరిశీలించారు. వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించేందుకు చేట్టాల్సిన చర్యలపై చర్చించారు. జాతీయ రహదారుల అధికారులు మరమ్మతులు చేపట్టేందుకు ముందుకు రావటంతో పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వంతెన పనులు పూర్తయ్యే వరకు మున్సిపల్ అధికారులు, హైడ్రా అథారిటీ అధికారులకు సహకరించాలని ఆదేశించారు. తాత్కాలిక పనులతో సరిపెట్టకుండా వంతెన సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ నిఖిత, ఏసీపీ వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ పోలీస్ సీఐ హనుమాన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, కౌన్సిలర్లు ఉమనాగరాజు, మహేష్, తుడుం గణేష్, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌యాదవ్, నాగరాజు, తదితరులు అధికారులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

పోలీసులు ప్రజల మన్ననలు పొందాలి

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు

మహేశ్వరం, సెప్టెంబరు 4 : పోలీసులు నిరంతర సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందడంతో పాటు గౌరవం ఉండేలా మెలగాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బుధవారం మహేశ్వరం పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు రకాల విభాగాల పని తీరు, సీసీ టీవీల నిర్వహణను పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ముఖ్యంగా మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం ఆయన స్టేషన్ ఆవరణలో పరిసరాల శుభ్రత, పచ్చదనాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

8న గుండె చికిత్స శిబిరం

ఆమనగల్లు, సెప్టెంబరు 4: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 8న కల్వకుర్తి ప్రశాంత్ క్లినిక్ వద్ద ఉచిత గుండె చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పీఆర్‌వో పాషా, క్యాంప్ చైర్మన్ వెంకట్ రెడ్డిలు తెలిపారు. హైదరాబాద్ మెడికేర్ ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసీజీ, 2డీఏకో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని వారు తెలిపారు. గుండె సమస్యలతో బాధ పడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● మండల వ్యవసాయ శాఖ అధికారులు
● వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన
● జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 150 ఎకరాల్లో నీట మునిగిన పత్తి పంట

చౌదరిగూడ/షాబాద్, సెప్టెంబరు 4: కురుస్తున్న వర్షాలకు పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని, పత్తి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారులు సూచించారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల, ఎల్కగూడ గ్రామాల్లో పత్తి పంటలను మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు 150 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా రైతులు పొలాల్లో ఉన్న వర్షపు నీటిని వెంటనే బయటికి తీసివేసుకోవాలన్నారు. ఏఈవో గౌరిప్రియ, రైతులు వెంకట్‌నర్సింహారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న పత్తిపంటలకు యూరియా, పొటాష్ వంటి ఎరువులు వేసుకోవాలని షాబాద్ మండల ఏవో వెంకటేశం తెలిపారు. బుధవారం మల్లారెడ్డిగూడలో పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. ముంపునకు గురైన పంటలు త్వరగా కోలుకోవడానికి 19-19-19 లేదా, 13-0-45, 10 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. నేలద్వారా వ్యాప్తి చెందే ఎండు తెగులు నివారించుటకు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, ఆల్టర్నేరియా, ఆకుమచ్చ తెగులు నివారణకు 2.5 గ్రాముల కార్బండిజిమ్, మ్యాంకోబేజ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు తదితరులున్నారు.



చౌదరిగూడ : ఎల్కగూడలో వాడిపోయిన చేనును పరిశీలిస్తున్న అధికారి రాజేందర్‌రెడ్డి



షాబాద్ : మల్లారెడ్డిగూడలో వాడిపోయిన పంటను పరిశీలిస్తున్న ఏవో వెంకటేశం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

యాచారం/చౌదరిగూడ, సెప్టెంబరు 4 : కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని యాచారం మండల ప్రత్యేకాధికారి పద్మజారమణి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలను ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు సేకరించి వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకులను విధిగా శుభ్రం చేయాలన్నారు. మురుగు కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. గ్రామాల్లో జ్వర సర్వే చేసి ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వీధి దీపాలు తక్షణమే బాగు చేయించాలన్నారు. ఎంపీవో శ్రీలత, పంచాయతీరాజ్ శాఖ ఏఈ సూర్యవంశీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్, వెటర్నరీ అధికారి రేణుక, కిరణ్‌కుమార్ తదితరులున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చౌదరిగూడ మండల ప్రత్యేకాధికారి వెంక్యానాయక్, కొందుర్గు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ అమృత జోసఫ్‌లు సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో సీజనల్ వ్యాధులపై మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆశాలు జ్వర పరీక్షలు చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని కార్యదర్శులకు సూచించారు. తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఇరిగేషన్ డీఈఈ సత్యప్రకాశ్, ఏఈ సింధు, ఎంపీవో హన్మంత్‌రెడ్డి, ఏపీఎం నర్సింహ, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, రాఘవులు, అశ్వక్, తదితరులు పాల్గొన్నారు.



యాచారం : మాట్లాడుతున్న పద్మజారమణి

క్రైం కార్నర్

సెంట్రింగ్ మెటీరియల్ అపహరణ

చేవెళ్ల, సెప్టెంబరు 4 : సెంట్రింగ్ మెటీరియల్ అపహరణకు గురైన సంఘటన బుధవారం శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మోకిలలోని సార్క్ శేషాద్రి వెంచర్‌లో బిల్డింగ్ నిర్మించేందుకుగాను సెంట్రింగ్ మెటీరియల్‌ని మంగళవారం తీసుకొచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో రూ.2లక్షల విలువ గల మెటీరియల్‌ని ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం వెంచర్‌లో సెంట్రింగ్ మెటీరియల్ కన్పించకపోవడంతో వెంచర్ మేనేజర్ లక్ష్మణ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని యువతి అదృశ్యం

చేవెళ్ల, సెప్టెంబర్ 4 : మతిస్థిమితం సరిగాలేని ఓ యువతి అదృశ్యమైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఈర్లపల్లికి చెందిన ఎండీ దస్తగిరి చెల్లెలు(16)కు మతిస్థిమితం సరిగా ఉండదు. ఈనెల 3న అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు గమనించగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం సాయంత్రం యువతి అన్న దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటింటా ఇంకుడుగుంత ఏర్పాటుకు చట్టం

● సీఎం సమక్షంలో రాష్ట్ర సదస్సు
● ప్రయోజనాలపై చర్చ : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌అర్బన్, సెప్టెంబరు 4: ఇంటింటా ఇంకుడు గుంతను తవ్వి వర్షపు నీటిని భూమిలో ఇంకించడానికి చట్టం తీసుకువస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇంకుడు గుంతల నిర్మాణాలతో బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. మున్సిపాలిటీలు, పట్టణాలు, నగరాలు, మహానగరాలు క్రాంకిట్ జంగిల్‌గా మారాయని గుర్తుచేశారు. అలాగే కుంటలు, చెరువులు, పాటుకాలువలు అక్రమణకు గురై భవన నిర్మాణాలు వెలుస్తున్నాయని తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో ఉన్న కుంటలు సైతం మాయమైనాయన్నారు. దాంతో కురిసిన ప్రతీ వర్షపు చుక్కా రోడ్లపైన ప్రవహిస్తూ లోతట్టు ప్రాంతాల్లో నిలుస్తున్నాయని, అదే ఇంటింటా ఇంకుడు గుంతలు తీస్తే చాలావరకు వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భజలం పెరుగుతుందన్నారు. ఇంకుడు గుంతలను తొవ్వి, చెరువులు, కుంటలను పరిరక్షిస్తే జల ప్రళయాలు తగ్గుతాయని వివరించారు. ఈ విధానం విధిగా అమలు చేస్తే తాగునీటి సమస్యనే ఉండబోదని తెలిపారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, రాష్ట్రస్థాయిలో సదస్సును నిర్వహిస్తామని, ఇంటి నిర్మాణ స్థాయిని బట్టి ప్రతీఇంటిలో ఇంకుడు గుంతను నిర్మించేలా చట్టం తీసుకువస్తామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.

'ప్రైవేటు' బస్సుల ఫిట్‌నెస్‌ను పరిక్షించాలి

చేవెళ్ల, సెప్టెంబరు 4 : పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించరాదని, ప్రైవేటు స్కూళ్ల బస్సుల ఫిట్‌నెస్‌ను పరిక్షించాలని ఏబీవీపీ నాయకులు అన్నారు. ఈమేరకు బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందించారు. ఏబీవీపీ చేవెళ్ల నగర కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ గత మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సిల్వర్ డైల్ పాఠశాల బస్సు పరిమితికి మించి విద్యార్థులను పాఠశాలలకు తరలిస్తున్న సందర్భంలో ప్రమాదం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు అన్ని ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్నెస్ పరిశీలించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రదీప్, అనిల్, కిషోర్, శివ, విజయ్, నితీష్, ప్రణయ్, హరీష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ముగిసిన శ్రావణ మాసం భజనలు



శివాలయంలో నిర్వహించిన పూజల్లో భజన బృందం తదితరులు

చేవెళ్ల, సెప్టెంబరు 4: శ్రావణమాసం సందర్భంగా చేవెళ్ల గ్రామంలోని భజన భక్తుల బృందం సభ్యులు ప్రతీరోజు ప్రత్యేక భజనలు చేశారు. ముగింపు పూజలు బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని శివాలయం, హనుమాన్ దేవాలయంలో నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి సా యంత్రం వరకు ప్రత్యేక పూజలతో పాటు భజనలు, కీర్తనలు ఆలపించారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది. పూజల అంతరం భక్తులందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో భజన భక్తుల బృందం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన



జాతీయ పోషణ్ మాసోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆమనగల్లు, సెప్టెంబరు 4: జాతీయ పోషణ మాసోత్సవంలో భాగంగా మాడ్గుల మండలం ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఆహార భద్రత, పోషణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోషకాహార పదార్థాల గురించి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ బృందం విద్యార్థులకు అవగాహన కల్పించింది. పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని తెలిపారు. హెచ్ఎం పర్వతాలు, శ్రీనివాస్ రెడ్డి, అనుదీప్, శ్రీలలిత, చెన్నకేశవులు, వంశీ, నాగజ్యోతి, శిరీష, విభాశ్రీ, శశి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

ఆమనగల్లు/కడ్తాల్/యాచారం, సెప్టెంబరు 4: అర్హత కలిగిన ప్రతీ రైతుకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి, కొత్తకుంట తండాలో బుధవారం కుటుంబ నిర్ధారణ సర్వే నిర్వహించారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఏవో శ్రీలత సర్వే నిర్వహించారు. ఇబ్రహీంపట్నం డివిజన్ వ్యవసాయాధికారి సుజాత యాచారం మండలం మాల్‌లోని రైతు వేదికలో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మహిళా శక్తి క్యాంటిన్లలో దివ్యాంగులకు వాటా కల్పించాలి

● ఎన్పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 4: మహిళా శక్తి క్యాంటిన్లలో దివ్యాంగులకు వాటా కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. ఇబ్రహీపట్నంలో బుధవారం జరిగిన ఎన్పీఆర్డీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు మహిళా శక్తి క్యాంటీన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ఇందులో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేగాకుండా సోలార్ ఎనర్జీ ప్రొడక్షన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, డెకరేషన్, ఫొటోగ్రఫీ, మీసేవా, డైరీఫాం వంటి తదితర స్కీంలలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎన్పీఆర్డీ రాష్ట్ర కోశాధికారి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జెర్కోని రాజు, నాయకులు నాగార్జున, నిర్మల, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● శంషాబాద్ డీసీపీ రాజేశ్



ఆమనగల్లు : మాట్లాడుతున్న డీసీపీ

ఆమనగల్లు/కడ్తాల్, సెప్టెంబరు 4: గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో బుధవారం గణేశ్ నవరాత్రోత్సవాల నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై ఉత్సవ కమిటీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై బి.వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీసీపీ రాజేశ్, సీఐ ప్రమోద్ కుమార్‌లు పాల్గొన్నారు. మండపాల నిర్వహణ, ఉత్సవాల ఏర్పాట్లపై పోలీసులు ఉత్సవ కమిటీలకు పలు సూచనలు చేశారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని డీసీపీ స్పష్టం చేశారు. మండపాల వద్ద నిఘా ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలకు చోటు లేకుండా చూసుకోవాలని సూచించారు. బందోబస్తు పరంగా పోలీసు శాఖ అన్ని చర్యలు చేపడుతుందని చెప్పారు. తహసీల్దార్ లలిత, ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత, ఇరిగేషన్ శాఖ ఏఈ తిరుపతయ్య, ఎస్సైలు వెంకటేశ్, శ్రీకాంత్, ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, ఏఎస్సైలు బాల్‌రెడ్డి, యాదయ్య, సీతారాంరెడ్డి, నాయకులున్నారు. అలాగే గణేశ్ నవరాత్రోత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని డీసీపీ కోరారు. కడ్తాల మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో బుధవారం సాయంత్రం గణేశ్ నవరాత్రి ఉత్సవాల నిర్వాహణపై ఉత్సవ కమిటీ సభ్యులు, యువజన సంఘాలు, నాయకులతో సీఐ శివప్రసాద్ ఆధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి డీసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీసులు పలు సూచనలు చేశారు. ఎస్సై వరప్రసాద్, తహసీల్దార్ ముంతాజ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు తదితరులున్నారు. మట్టిగణపతి ప్రతిమను డీసీపీకి స్థానిక మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అందజేశారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరపుకోవాలి

యాచారం : గణేష్ నవరాత్రోత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని, మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఏసీపీ కేపీవీ రాజు కోరారు. మండల కేంద్రంలోని సాయిశరణం గార్డెన్‌లో ఏర్పాటుచేసిన శాంతికమిటీ సమావేశంలో ఏసీపీ పాల్గొని మాట్లాడుతూ మండపాల వద్ద సినిమా పాటలు పెట్టరాదన్నారు. రాత్రివేళ ఇద్దరు నిద్రించాలన్నారు. నిమజ్జనం రోజు మంటపం వద్ద డీజే వాడరాదని ఆదేశించారు. ప్రత్యేకాధికారి పద్మజారమణి, సీఐ శంకర్‌కుమార్, ఎస్సైలు మధు, సత్యనారాయణ, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత తదితరులున్నారు.



యాచారం : మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

చేవెళ్ల పంచాయతీ రాజ్ డీఈఈగా లీలా గణేశ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న లీలా గణేశ్

చేవెళ్ల, సెప్టెంబరు 4: చేవెళ్ల పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా (డీఈఈ) లీలా గణేశ్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయంలో పని చేస్తూ చేవెళ్లకు బదిలీ వచ్చారు. ఇదివరకు ఇక్కడ డీఈఈగా పని చేసిన దయానంద్‌రెడ్డి ఆగస్టులో పదవీ విరమణ పొందారు. నూతన డీఈఈకి పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పంట నష్టం బాధితులను ఆదుకోవాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 4: జిల్లాలో నాలుగు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, జిల్లా రైతు సంఘం నాయకుడు రూపం వెంకట్‌రెడ్డి కోరారు. ఎకరాకు రూ.25 వేల చొప్పున ప్రభుత్వం పరిహారం అందించి రైతులకు మనోధైర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం వెంకట్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వర్షాలకు జొన్న, పత్తి పంటల్లోకి నీరు చేరి రైతులకు తీవ్ర నష్టం చేకూరిందన్నారు. కోతకొచ్చిన జొన్న పంట వర్షంతో తడిసి నల్లబారిందని తెలిపారు. దెబ్బతిన్న గ్రామీణ రోడ్లు, చెరువు కుంటలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని కోరారు. ఇళ్లు కూలిపోయి నష్టపోయిన కుటుంబాలకు ఇందిరమ్మ పథకం కింద పక్కా ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. నాయకులు సురమళ్ల సుభాష్, రమేశ్, కుమార్, నరేందర్, బాల్‌రాజ్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్, సెప్టెంబరు 4: మండల కేంద్రానికి చెందిన గొంగళ్ల వెంకటమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం మృతదేహాన్ని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ సందర్శించి నివాళులర్పించారు. మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికసాయం, వెంకటేశ్ నిత్యావసర సరుకులు అందించారు. జహంగీర్ బాబా, మల్లయ్య, భిక్షపతి, మంకి శ్రీను, శ్రీ కాంత్, రమేశ్, మహేశ్, సాయిలు, అంజయ్య, తదితరులు ఉన్నారు.



సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న రుద్రకుమార్

నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలి

● ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రుద్రకుమార్

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 4: కేంద్రప్రభుత్వం రవాణా రంగంలోని కార్మికుల కొరకు అనేక నూతన చట్టాలను తీసుకువచ్చిందని, వాటిని వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రుద్రకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ఆటో యూనియన్ సీఐటీయూ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఆటో కార్మికులు రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా కేంద్రప్రభుత్వం రవాణా రంగంలోని కార్మికులపై అనేక నూతన చట్టాలను తీసుకువచ్చిందని, వాటి ప్రకారం కార్మికులకు ఎదైనా ప్రమాదం జరిగినా.. వారి తప్పు లేకపోయినా పూర్తి బాధ్యత డ్రైవర్లకు వర్తింపజేస్తూ రూ.10లక్షల జరిమానా, 7 సంవత్సరాల జైలు శిక్ష విధించేలా నూతన చట్టంలో ఉందని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ మొయినాబాద్ మండలంలోని ఆటో కార్మికులకు ఇబ్బందులు తలెత్తినా సీఐటీయూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు డప్పు ప్రవీణ్, మొయినాబాద్ కన్వీనర్ అజీజ్‌నగర్ ప్రవీన్ కుమార్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నం, మహేందర్, చెన్నయ్య, ఉస్మాన్, రాజేందర్, బాబు, వినోద్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఆధునికీకరణకు విరాళాల సేకరణ

షాద్‌నగర్, సెప్టెంబరు 4 : గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ పట్టణంలోని జూనియర్ కళాశాల ఆధునీకరణ కోసం విరాళాలు సేకరించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని జూనియర్ కళాశాలను వారు సందర్శించారు. సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జూనియర్ కళాశాల అధ్వాన్నస్థితికి చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు(గురువారం) ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగే గురుపూజోత్సవానికి వ్యాపారవేత్తలు, విద్యావంతులు, మేధావులు పాల్గొని విరాళాలు అందించాలని కోరారు. బాలరాజుగౌడ్, లింగారెడ్డిగూడ అశోక్, రాయికల్ శ్రీనివాస్, నరేష్ తదితరులున్నారు.

కాలనీలకు కొత్త శోభ

● ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగల మంజూరు

షాద్‌నగర్, సెప్టెంబరు 4: పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు నడుం బిగించారు. ఇటీవల పట్టణంలోని 2, 16, 18వ వార్డుల్లో ఎమ్మెల్యే శంకర్ పర్యటించి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి బుధవారం చర్యలు చేపట్టారు. వార్డుల్లో కాలం చెల్లిన విద్యుత్ తీగల వల్ల కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కొత్త విద్యుత్ తీగలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 32 విద్యుత్ పోల్స్‌లను మంజూరు చేసి పనులను ప్రారంభించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించారు.



కాలనీలలో విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా రామకృష్ణయాదవ్‌ను నియమించండి

యాచారం, సెప్టెంబరు 4 :ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా యాచారం మండల మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణయాదవ్‌కు అవకాశమివ్వాలని మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటివరకు బీసీలకు వైస్ చైర్మన్ పదవి కేటాయించలేదని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్తంగా..

కేశంపేట : పీఆర్‌టీయూ మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కరుణాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా గోవర్ధనచారి, ఉపాధ్యక్షుడిగా జంగయ్య, ఉపాధ్యక్షురాలిగా గీతారెడ్డి, కార్యదర్శిగా రాఘవేందర్‌లను ఎన్నుకున్నారు.

శంషాబాద్ రూరల్ : ఆల్ మిజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఉమ్రా యాత్రకు వెళ్లి బుధవారం తిరిగొచ్చిన యాత్రికులకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. 15 రోజులక్రితం వారు యాత్రకు వెళ్లి తిరిగి వచ్చారు.

కందుకూరు : కిసాన్‌సంఘ్ మండలాధ్యక్షుడిగా సురసాని సీతారాంరెడ్డి, కార్యదర్శిగా బుడ్డోల్ల ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులుగా డి.కృష్ణగౌడ్, గంగుల రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా సురసాని యాదగిరిరెడ్డి, ఉపకార్యదర్శిగా చిట్టి లక్ష్మణ్, సలహాదారులుగా సురసాని వెంకటరెడ్డి, సునిల్‌కుమార్‌మిశ్రా, కార్యవర్గ సభ్యులుగా పాశం శ్రీనివాస్, బి.రమేష్, చంద్రశేఖర్‌రెడ్డిలను నియమించారు.

చెరువులు, కుంటలను కాపాడాలి : బక్కని



చేగూర్ శివారులో వనం కుంటను పరిశీలిస్తున్న బక్కని నర్సింహులు

నందిగామ, సెప్టెంబరు 4: చెరువులు, కుంటలను కాపాడాలని, అప్పుడే మానవ మనుగడ సాధ్యమని టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. బుధవారం నందిగామ మండల పరిధిలోని బండోనిగూడ, కన్హా శాంతివనం, బుగ్గోనిగూడ, చేగూర్‌లోని చెరువులు, కుంటలను నాయకులు మర్రెడ్డి, దారుర్ సతీష్, తుమ్మల నర్సింలులతో కలసి ఆయన పరిశీలించారు. సంస్థల పేరుతో పాటుకాలువలు, కుంటలు, చెరువులు ధ్వంసం చేసి ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. సంపన్నులు రైతులకు డబ్బులు ఆశచూపి పొలాలను తక్కువ ధరకు కొని వారిని కూలీలుగా మారుస్తున్నారన్నారు. ప్రభుత్వం చెరువులు, కుంటలు, పాటుకాలువలను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకొని సహజ సంపదను కాపాడాలని ఆయన కోరారు.

ఒక్కరి నేత్రదానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న మోతీలాల్ నాయక్

ఆమనగల్లు, సెప్టెంబరు 4: ఒక్కరి నేత్రదానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని, మరణానంతరం నేత్రదానం చేయడానికి ప్రతీఒక్కరు స్వచందంగా ముందుకు రావాలని ఎన్‌వీసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి. మోతీలాల్ నాయక్ పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సుకు మోతీలాల్ నాయక్, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ ఎం.చంద్రశేఖర్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ పరీక్షిత్ నరేందర్, డాక్టర్లు శ్రీకాంత్, సుజల, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాష, కార్యదర్శి మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ, జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి పనితీరుపై ఫిర్యాదు

తలకొండపల్లి, సెప్టెంబరు 4: గడ్డమీది తండా పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తండాలో సమస్యలను పట్టించుకోవడం లేదని బుధవారం తండా నాయకులు ఎంపీడీవో శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు రమేశ్ నాయక్ ఆధ్వర్యంలో తండా నాయకులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను కలిసి ఫిర్యాదు అందజేశారు.